క్లుప్తంగా

టీడీఆర్ బాండ్లకు వ్యతిరేకంగా పాదయాత్ర నేడు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం నిర్వాసితులతో కలిసి నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం నేత బ్రహ్మాజీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నిర్వాసితులకు పరిహారాన్ని నేరుగా నగదు రూపంలో అందిస్తామని హామీ ఇచ్చి నేడు టీడీఆర్ బాండ్లు మాత్రమే ఇస్తామంటూ ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. సోమవారం ఉదయం అచ్యుతాపురం మండలం హరిపాలెం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేపడుతున్నామన్నారు. పాదయాత్రకు పెద్ద ఎత్తున నిర్వాసితులు తరలిరావాలని కోరారు.

ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపిక


నరసింహ నాయుడు

మునగపాక: ఒంగోలు ట్రిపుల్ ఐటీకి మునగపాక గ్రామానికి చెందిన విద్యార్థి నరసింహనాయుడు ఎంపికయ్యాడు. మునగపాక పల్లపు వీధికి చెందిన పిల్లా సూర్యనారాయణ మనుమడు నరసింహనాయుడు ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఒంగోలు ట్రిపుల్ ఐటీలో స్థానం దక్కించుకున్నాడు. చిన్నప్పటి నుంచి చదువులో రాణిస్తున్న నరసింహనాయుడు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పీఏసీఎస్ పాలక వర్గాల ప్రమాణ స్వీకారం


పీఏసీఎస్ అధ్యక్షులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి: నియోజకవర్గంలో నూతనంగా నియమితులైన పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు, డైరెక్టర్లతో ఆదివారం హోంమంత్రి వంగలపూడి అనిత ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పది పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జులు కొప్పిశెట్టి బుజ్జి, వెలగ శ్రీనివాసరావు, దార్ల కృష్ణ, చిక్కాల శ్రీను, గెద్దం కన్నబాబు, దేవరపు రాజబాబు, గుర్ర రామకృష్ణ, రెడ్డి పవన్‌కుమార్, తుమ్మపాల నాగేశ్వరరావు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి ఆమె శుభాకాంక్షలు చెప్పారు. 2029 నాటికి పాయకరావుపేటలో స్టీల్ ప్లాంట్ రన్నింగ్‌లోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొప్పిశెట్టి వెంకటేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోట నాగేష్, జనసేన ఇన్‌చార్జి గెద్దం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్ని కాపాడే బాధ్యత లేదా?


మాట్లాడుతున్న గనిశెట్టి కనకరాజు, చిత్రంలో ఎంపీటీసీ అప్పలరాజు, సంతోష్

పెందుర్తి: 'మన గ్రామంలోని ఐదెకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారు. మేము దానిపై పోరాటం చేస్తున్నాం. ఆ భూమిని కాపాడాలని మా బాధ్యతగా ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశాం. అలా చేశామని మాపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. ఆ భూమిని మీరు కాపాడాలనుకుంటున్నారా.. లేక కబ్జా చేస్తున్న వారికి మద్దతు పలుకుతున్నారా' అంటూ చింతగట్లకు చెందిన టీడీపీ నాయకులు తమ పార్టీకే చెందిన ప్రత్యర్థి వర్గం నాయకులపై విరుచుకుపడ్డారు. ఆదివారం టీడీపీ నేత, అయ్యారక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు మాట్లాడుతూ సర్వే నెం.81/2లో సుమారు రూ.25 కోట్లు విలువ చేసే ఐదెకరాల భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది గిట్టని స్థానిక టీడీపీ నాయకుడు చిన్నారావు, ఇతర టీడీపీ నాయకులు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు, స్థానిక నాయకుడు బొట్టా సంతోష్ గ్రామపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయంపై కేసు నమోదు

నాతవరం : మండలంలో జిల్లేడుపూడి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులో మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నామని నాతవరం ఎస్ఐ సిహెచ్. భీమరాజు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్టుగా మాకు అందిన సమాచారంతో దాడులు చేసి, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్నామన్నారు. నిందితుడి వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మండల వ్యాప్తంగా నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయించే గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

వేళకు చేరలేక..

• గ్రామీణ రోడ్లపై రాకపోకలకు ఇక్కట్లు • ఇరువైపులా ముళ్లపొదలు • అడుగడుగునా గోతులమయం • వన్ వేగా మారిన రహదారులు


అధ్వానంగా ఉన్న బోదిగల్లం, సీతంపాలెం రోడ్డు


పెంటకోట సింగిల్ రోడ్లో ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం


పాయకరావుపేట నుంచి మంగవరం వెళ్లు రోడ్డు ఇరుకుగా ఉన్న దృశ్యం

నక్కపల్లి: గ్రామీణ రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇరువైపులా పిచ్చిమొక్కలు కప్పేయడం వల్ల సకాలంలో గమ్యస్థానానికి చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలైతే పర్వాలేదుగాని నాలుగు చక్రాల వాహనాలు, ఆటోల్లో వెళ్లేవారికి రోడ్డు పక్కన పొదలు తగులుతున్నాయి. దీనికితోడు చాలా వరకు రోడ్లు గోతులు ఏర్పడి రాళ్లు తేలి బురదమయంగా ఉన్నాయి. దాంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్దగా వెడల్పు లేకపోవడంతో ఈ రూట్లలో తిరిగే ఆటోలు విపరీతమైన వేగంతో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు సంభవించి పలువురు గాయాల పాలవుతున్నారు. ఒక వాహనం వెళ్లే వెడల్పుతోనే రోడ్డు నిర్మించారు. దీనికితోడు రోడ్లు శిథిలావస్థకు చేరుకుని రాళ్లు తేలి ఉండటంతో రాకపోకలకు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది.


చినుకు పడితే చిత్తడి..

కొన్ని గ్రామాలకు మట్టిరోడ్లే ఉన్నాయి. చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. పాయకరావుపేట నుంచి మంగవరం, అరట్లకోట, మంగవరం నుంచి సత్యవరం, మంగవరం నుంచి పెద్దిపాలెం, గోపాలపట్నం నుంచి పెంటకోట తదితర రూట్లలో ఈ పరిస్థితి ఉంది. నామవరం- గుంటపల్లి, మంగవరం-గుంటపల్లి వెళ్లే రోడ్డు, నక్కపల్లి మండలంలో గొడిచర్ల- జగన్నాథపురం, చీడిక-జగన్నాథపురం, నామవరం- దేవవరం, జాతీయ రహదారి నుంచి చినరామభద్రపురం, రమణయ్యపేట నుంచి రేబాక, సారిపల్లిపాలెం నుంచి సిహెచ్ ఎల్‌పురం, జానకయ్యపేట, పెదతీనార్ల, ఉపమాక- చందనాడ, ఎస్ నర్సాపురం, నెల్లిపూడి నుంచి డీఎల్‌పురం, గునిపూడి, బంగారయ్యపేట, నక్కపల్లి-బోదిగల్లం, పెదదొడ్డిగల్లు, న్యాయంపూడి ఎస్ రాయవరం మండలంలో గుర్రాజుపేట, గుడివాడ, పేటసూదిపురం, సైతారుపేట, చిన ఉప్పలం తదితర గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి ఇలాగే ఉంది.

పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు

మారుమూల గ్రామాలు కావడంతో ఈ ప్రాంతాలకు బస్సు సదుపాయం లేదు. ఆటోలనే ఆశ్రయిస్తుంటారు. ఆయా గ్రామాల్లో వందలాది ఆటోలు తిరుగుతుంటాయి. రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, పొదలు ఉన్నప్పటికీ డ్రైవర్లు మాత్రం ఇవేమి పట్టించుకోకుండా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రూట్లలో ముందు వెళ్లే వాహనం, ఎదురుగా వచ్చే వాహనం సరిగా కనిపించే అవకాశాలు చాలా తక్కువ. పది నుంచి 12 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డు కావడంతో రెండు వాహనాలు ఒకే విధమైన స్పీడుతో ఎదురెదురుగా తప్పించుకోవడం చాలా కష్టం. ఒక వాహనం స్లో అయితే తప్ప ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదు. ఇంత క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆటోవాలాలు, ద్విచక్రవాహన చోదకులు ఏమాత్రం స్పీడు తగ్గడం లేదని సైకిళ్లపై వెళ్లేవారు చెబుతున్నారు. ఈ రూట్లలో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. అక్కడ కనీసం హెచ్చరిక బోర్డులను ఆర్అండ్‌బీ వారు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. ఈ రూట్లలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను, పొదలను తొలగిస్తే రోడ్డు కొంత మేర విశాలంగా ఉంటుందని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చని ఆయా గ్రామాల వారు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఈ రూట్లలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టి ప్రమాదాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


అధ్వానంగా రోడ్డు



మా గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడ గోతులు పడ్డాయి. ఇరువైపులా ముళ్లపొదలు రోడ్డు మీద వరకు వచ్చేశాయి. ఆటోల్లోను, మోటారు సైకిళ్లపై వెళ్లే సమయంలో కళ్లలోకి తగులుతున్నాయి. చీకటి పడితే రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. కాలినడకన వచ్చే వారు రోడ్లపై విషసర్పాలు ఉంటున్నాయని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు రెండు పక్కల కంచె తుప్పలను నరికిస్తే కొంత వరకు ఇబ్బంది తప్పుతుంది.

– కాకర వెంకటరావు, జగన్నాథపురం

ఇరుకుగా చాలా రోడ్లు



మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. మంగవరం, సత్యవరం, పెంట కోట, అరట్లకోట, మాసయ్యపేట తదితర గ్రామాల రోడ్లు చాలా ఇరుకుగా ఉంటున్నాయి. రోడ్లు ఇరుకుగా ఉండటం, ఇరువైపులా ముళ్లపొదలు ఉండటం వల్ల రాకపోకల సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. జంగిల్ క్లియరెన్స్ చేపట్టి ఇరువైపులా బెర్మ్‌లు నిర్మిస్తే కొంత వరకు ఇబ్బందులు తగ్గుతాయి.

– రాజేష్‌ఖన్నా, మంగవరం

జంగిల్ క్లియరెన్స్ పనులు

ప్రధాన గ్రామాలకు వెళ్లే మెయిన్ రోడ్లో ఇటీవల ఉపాధి హామీ నిధులతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నాం. రోడ్లకు ఇరువైపులా తుప్పలు, పిచ్చిమొక్కలు తొలగిస్తున్నాం. పంచాయతీ వారు కూడా ఎప్పటికప్పుడు జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహిస్తే కొంతవరకు ప్రమాదాలను నివారించవచ్చు

– సీతారామరాజు, ఎంపీడీవో, నక్కపల్లి

రేపు బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్


పార్టీ నేతలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమం మునగపాకలో ఈ నెల 29న నిర్వహిస్తామన్నారు. ఆదివారం బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. బూటకపు హామీలతో గద్దెనెక్కిన కూటమి పాలన పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం మునగపాక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో జరిగే సమావేశానికి పార్టీ నేతలు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు ఈ సమావేశానికి హాజరు కానున్నారన్నారు. మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, గంగప్పలనాయుడు, ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, బొడ్డేడ శ్రీనివాసరావు, చదరం అప్పలనాయుడు, అయినంపూడి విజయభాస్కరరాజు, ఎంపీటీసీలు మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, మద్దాల వీరునాయుడు, పార్టీ నేతలు షేక్ ఇస్మాయిల్, దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, కాంద్రేగుల జగన్, బొడ్డేడ బుజ్జి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయక ఇబ్బందులు


సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ

ఎస్.రాయవరం: గ్రామ పంచాయతీలకు ఏడాదిగా నిధులు విడుదల చేయక నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ వాపోయారు. ఆదివారం తిమ్మాపురం సచివాలయంలో ఆయన మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు విడుదల చేసి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అధికారంలోకి వస్తే సకాలంలో నిధులు విడుదల చేస్తామన్న మాటలు ఏమయ్యాయని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పంచాయతీల్లో తాగునీరు, పారిశుధ్య పనులకు సర్పంచ్‌లు అప్పులు చేసి చేపట్టాల్సి వస్తుందన్నారు. కొన్ని గ్రామాల్లో అత్యవసర పనులు చేయించక దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలు బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిధులు విడదల చేయాలని, లేకుంటే సర్పంచ్‌లంతా ఆందోళన బాట పట్టాల్సి వస్తుందన్నారు.

వైద్యుడి పుస్తకానికి ప్రశంసలు


హోం మంత్రి అనితకు పుస్తకం అందిస్తున్న డాక్టర్ ఎం.కె.రెడ్డి

పాయకరావుపేట: జనరల్ సర్జన్ డాక్టర్ ఎం.కె.రెడ్డి తొలి రచన 'స్టడీ హ్యాండ్స్–స్టడీ మైండ్' పుస్తకానికి ప్రశంసలు అందుతున్నాయి. ఆయన మండలంలో ప్రభుత్వ వైద్యాధికారిగా పనిచేసి, ఉన్నత చదువు కోసం గతేడాది గుంటూరు వెళ్లారు. సర్జరీ శిక్షణలో వున్న రెసిడెంట్ల కోసం ఈ పుస్తకం రాసినట్టు డాక్టర్ రెడ్డి చెప్పారు. శస్త్రచికిత్స సమయంలో ఎదురయ్యే ఒత్తిడి, దానిని ఎదుర్కొనడంలో మైండ్ ఫుల్‌నెస్ ఎలా ఉపకరిస్తుందో ఈ పుస్తకంలో చక్కగా వివరించారు. ఆపరేషన్ థియేటర్‌లో చేతులు స్థిరంగా ఉండాలంటే ముందు మనసు స్థిరంగా ఉండాలని తెలిపారు. ఈ పుస్తకం ప్రతిని హోంమంత్రి వంగలపూడి అనితకు ఆదివారం అందించారు. పట్టణంలో ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆమె ఈ పుస్తకాన్ని అందుకుని వైద్యుడి కృషిని మెచ్చుకున్నారు.

రైతులకు మెరుగైన సేవలందిస్తాం

తహసీల్దార్ సత్యనారాయణ


మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ పి.సత్యనారాయణ పేర్కొన్నారు. రైతులకు అవసరమయ్యే పట్టాదారు పుస్తకాలు, భూ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. మునగపాక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన రైతు సంఘ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. మునగపాక రెవెన్యూ పరిధిలో రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేకంగా ఒకరోజు మునగపాక రైతుల కోసం గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. రైతు సంఘ నాయకులు సహకరించాలన్నారు. రైతులకు, అధికారులకు మధ్య వారధిగా రైతు సంఘం పనిచేయాలన్నారు. తద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు అవసరమయ్యే సేవలను సకాలంలో అందించేలా చూడాలన్నారు. రైతు సంఘ కార్యవర్గం రైతులకు ఇబ్బందులు ఎదురైతే, వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవలందించాలన్నారు. మునగపాక రైతు సంఘానికి ఎంతో గుర్తింపు ఉందన్నారు. పలు ఉద్యమాల్లో రైతులు విజయం సాధించి ఈ ప్రాంతానికి ఆదర్శంగా నిలిచారన్న విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం వీఏఏగా సేవలందించి బదిలీపై వెళ్లిన సింధూజను పలువురు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు ఆడారి అచ్చియ్యనాయుడు, పెంటకోట విజయ్, టెక్కలి పరశురామ్, పెద్దలు కర్రి సాయికృష్ణ, దాడి మునిలినాయుడు, పోలిమేర గణేష్, ఆడారి కాశీబాబు, మళ్ల సంజీవరావు, సూరిశెట్టి కన్నారావు, టెక్కలి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.


వీఏఏ సింధూజ దంపతులకు సన్మానం

రైతు సంఘ అధ్యక్షునిగా మహేష్..

మునగపాక రైతు సంఘ అధ్యక్షునిగా ఆడారి మహేష్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా విల్లూరి నరసింగరావు, ఉపాధ్యక్షులుగా ఆడారి శ్రీకాంత్, దాడి శివ, కోశాధికారిగా ఆడారి లక్ష్మణరావు, సహాయ కార్యదర్శులుగా బొడేడ్డ రామారావు, వెలగా మురళి తదితరులు ఎన్నికయ్యారు.

కూటమి హామీలపై రాజీలేని పోరాటం


చంద్రబాబు హామీలను గుర్తు చేస్తూ రూపొందించిన క్యూఆర్ కోడ్ ప్లకార్డులను విడుదల చేస్తున్న ధర్మశ్రీ, కన్నబాబు


రాంబిల్లి సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

• చంద్రబాబుది డైవర్షన్ పాలిటిక్స్
• అక్రమ కేసులకు బెదిరేవారెవ్వరూ ఇక్కడ లేరు
• వైఎస్సార్ సీపీ యలమంచిలి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ
• రాంబిల్లిలో పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం

రాంబిల్లి(అచ్యుతాపురం): సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై రాజీలేని పోరాటం చేస్తామని వైఎస్సార్ సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. ఆదివారం రాంబిల్లిలో వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ధర్మశ్రీ హాజరై 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' గురించి ప్రస్తావిస్తూ ప్రతీ హామీని అమలు చేయాలనే డిమాండ్‌తో ప్రజల్లోకి వెళతామని తెలిపారు. అధికారం చేపట్టి ఏడాది గడిచినప్పటికీ హామీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారని చంద్రబాబు, పవన్‌లను విమర్శించారు. ఎన్నికలకు ముందే కూటమి నేతలు సంతకాలు చేసి బాండ్లను ప్రజలకు అందజేశారన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలన్నిటినీ అమలు చేస్తామని ప్రగల్భాలు పలికారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ అమలు చేయలేక ప్రతిపక్ష పార్టీ నేతలపై లేనిపోని కేసులు పెడుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు. అందుకే కూటమి నేతల హామీలను గుర్తు చేస్తూ బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ దశల వారీగా చేపడుతున్నామని తెలిపారు. ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక లేనిపోని కేసులు పెట్టి విపక్ష నేతల్ని బెదిరింపు ధోరణిలోకి నెట్టి ప్రజల్ని మభ్య పెడుతున్నారని ఆరోపించారు. హామీలన్నిటిని నెరవేర్చే వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేయగలిగామన్నారు. ఇప్పుడు మాత్రం హామీలు అమలు చేసేందుకు బడ్జెట్ లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పథకాలపై మంత్రుల ప్రకటనలు ప్రజల్ని గందరగోళంలోకి నెట్టే విధంగా ఉన్నాయని తెలిపారు. హామీలపై పోరాడుతున్న వారిపై కేసులు పెడితే బెదిరిపోయే వారు ఇక్కడ ఎవ్వరూ లేరన్నారు. ఎంపీపీ శిరీష శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పిన్నమరాజు కిశోర్, నెట్టం సత్యనారాయణ, అప్పన్నదొర, తిరుపతిరావు, రామకృష్ణ, సత్యనారాయణ, అరుణలత, వెంకి, రాజు, ఈశ్వరరావు, రేబాక రాము, రమణరావు, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వ్యాఖ్యలు హాస్యాస్పదం

కూటమి ప్రభుత్వ పాలనంతా దగా, దమన కాండతో సాగిందని యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ విమర్శించారు. ఆదివారం రాంబిల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరితే ఆంధ్రానే అమ్మేయాలని ఒక మంత్రి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆంధ్రాను అమ్మేయాలనే వ్యాఖ్యలు చూస్తుంటే కూటమి నేతలపై ఉమ్మేయాలా..? అనే స్థితికి ప్రజలు వచ్చారని ధ్వజమెత్తారు. తమ అధినేత జగన్‌మోహన్ రెడ్డి పిలుపుతో నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని నాల్గో విడతగా వచ్చే ఒకటో తేదీ నుంచి గ్రామస్థాయిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మశ్రీకి సీనియర్ నేతల ఆశీస్సులు


పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గిరిబాబుతో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

రాంబిల్లి(అచ్యుతాపురం): వైఎస్సార్ సీపీ యలమంచిలి నియోజక వర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ రాంబిల్లి మండలంలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నేతల వద్దకు వెళ్లి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ క్రమంలోనే మాజీ ఎంపీపీ దివంగత చంటిబాబు కుటుంబీకుల్ని పరామర్శించారు. చంటిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. చంటిబాబు కుమారుడు శేఖర్‌బాబును పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ మాస్టర్ బాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గిరిబాబుల ఆశీస్సులు తీసుకున్నారు. మాజీ జెడ్పీటీసీ సత్యంరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ శ్రీనుబాబు, నెట్టం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు


దేవరాపల్లిలోని ఎరువుల దుకాణంలో నిల్వలను తనిఖీ చేస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ దుకాణదారులను హెచ్చరించారు. మండలంలోని లైసెన్స్ ఎరువుల దుకాణాలను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. దేవరాపల్లిలోని హేమ రైతు డిపో, మన గ్రోమోర్, కాశీపురంలోని శ్రీలక్ష్మీనారాయణ, వెంకట రోహిణి లైసెన్స్ ఎరువుల దుకాణాలలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ దుకాణాల ఎదుట ఎరువుల ధర పట్టిక ఏర్పాటు చేయడంతో పాటు ఎరువులు కొనుగోలు చేసే ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు. రైతు విస్తీర్ణం ఆధారంగా ఎరువులు విక్రయించాలని, ఎరువులు కొనుగోలు చేసే రైతుల నుంచి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు షాపు మూసే ముందు ఎన్ని బస్తాలు నిల్వ ఉన్నాయో స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో 24 టన్నులు, కలిగొట్ల పీఏసీఎస్‌లో 24 టన్నులు, ప్రైవేటు దుకాణాల్లో 40 టన్నులు మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

వాహన చోరులతో తస్మాత్ జాగ్రత్త!


సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ వాహనాలను ఎక్కడిపడితే అక్కడ పార్క్ చేసి విధులకు వెళ్లిపోతున్నారు. తిరిగి వచ్చి చూసే సరికి వాహనాలు కనిపించకపోవడంతో లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం వెనుక భాగంలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలను పార్క్ చేసి విధులకు వెళ్తుంటారు. ఎన్టీపీసీ వద్ద కూడా పార్కింగ్ స్థలం చాలినంత లేకపోవడంతో చెట్ల నీడన వాహనాలను పార్క్ చేస్తున్నారు. ఇదే అదనుగా చేసుకుని వాహన చోరులు వాటిని దొంగిలిస్తున్నారు. మెకానిక్ షెడ్ల వద్ద కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల సినిమాహాలు కూడలి వద్ద ఓ మెకానిక్ షెడ్‌కు రిపేర్ కోసం ఇచ్చిన వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించుకుపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో షెడ్ యజమాని రూ.50 వేలు చెల్లించుకోవాల్సి వచ్చింది. దీనిపై స్థానిక సీఐ మల్లికార్జునరావును వివరణ కోరగా.. పరవాడ ప్రాంతంలో వాహన చోరీలకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాలుగైదు నెలలుగా వాహన చోరీలు తగ్గుముఖం పట్టాయన్నారు. భద్రత లేని ప్రదేశాల్లో వాహనాలను నిలపడం శ్రేయస్కరం కాదని హెచ్చరించారు.